# నేడు మెదక్‌లో ప్రజా ఆశీర్వాద సభ

- హాజరుకానున్న సీఎం కేసీఆర్
- ఏర్పాట్లు పూర్తి చేసిన బీఆర్ఎస్ నేతలు
- భారీగా సమీకరణకు సన్నాహాలు
- సభను విజయవంతం చేయండి
- మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కుర్చీలు



మెదక్‌లోని సీఎస్ఐ చర్చిలో సభా ప్రాంగణాన్ని ఏర్పాటు చేస్తున్న దృశ్యం

మెదక్, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభకు మెదక్ పట్టణం సిద్ధమైంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మెదక్‌లో నిర్వహించనున్న సభకు సీఎం కేసీఆర్ హాజరుకానున్న సందర్భంగా గులాబీ నేతలు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం 5 గంటలకు సభ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మెదక్ పట్టణంలోని సీఎస్ఐ చర్చి కాంపౌండ్‌లో సభాస్థలిని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వేదిక, వాటర్ ప్రూఫ్, 50వేల మంది కూర్చునేలా వేదికను సిద్ధం చేశారు. కళా బృందాల ప్రదర్శన కోసం ప్రత్యేకంగా వేదిక ఏర్పాటు చేశారు. 2018 ఎన్నికల్లో కూడా సీఎం సభ ఇదే స్థలంలో నిర్వహించారు. సీఎం హాజరుకానున్న నేపథ్యంలో పోలీసులు సభాస్థలిని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. మెదక్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి, మెదక్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మెదక్ నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి సుమారు 50 వేల మంది సభకు హాజరయ్యేందుకు రెండు రోజులుగా ఏర్పాట్లు చేస్తున్నారు. సభకు వచ్చే బీఆర్ఎస్ శ్రేణులకు ఇక్కట్లు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం సభకు పెద్దఎత్తున జనాన్ని తరలిస్తున్నారు.

### ఏర్పాట్లు పూర్తి..

ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజా ఆశీర్వాద బహిరంగ సభకు పార్టీ శ్రేణులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. హెలికాప్టర్‌లో సీఎం వస్తుండడంతో సీఎస్ఐ చర్చి కాంపౌండ్‌లో సభా స్థలి పక్కనే హెలిప్యాడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను సంబంధిత అధికారులు చేపడుతున్నారు.

### సభను విజయవంతం చేయండి: బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొనే ప్రజా ఆశీర్వాద సభకు మెదక్ నియోజకవర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్ఎస్ అభ్యర్థి, మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెదక్ నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో సహకరించారన్నారు. మెదక్ పట్టణ రూపురేఖలు మారిపోయాయని, జిల్లా కేంద్రం ఏర్పాటుతో మెదక్‌లోనే కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలు కూడా వచ్చాయని గుర్తుచేశారు. సుమారు 50వేల మంది ఈ సభకు హాజరయ్యే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



పకడ్బందీగా భద్రతా చర్యలు చేపడుతున్న పోలీస్ సిబ్బంది

# బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

- పాల్గొన్న అందోల్ ఎమ్మెల్యే అభ్యర్థి క్రాంతి కిరణ్ సతీమణి పద్మావతి
- సిందోల్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

రేగోడ్, నవంబర్ 14: రేగోడ్ మండలంలోని సిందోల్ గ్రామంలో మంగళవారం బీఆర్ఎస్ అందోల్ ఎమ్మెల్యే అభ్యర్థి క్రాంతికిరణ్ సతీమణి పద్మావతి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ అందిస్తున్న సంక్షేమమ పథకాలను వివరిస్తూ, గడపగడపకూ వెళ్లి కారు గుర్తుకు ఓటు వేసి అందోల్ ఎమ్మెల్యే అభ్యర్థి క్రాంతికిరణ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. పద్మావతికి గ్రామంలో ఘన స్వాగతం లభించింది. ప్రచారంలో ఆమెతో సర్పంచ్ మంజుల నాగయ్య, ఉపసర్పంచ్ మచ్కురి కృష్ణ, గ్రామాధ్యక్షుడు శేఖర్, మెదక్ జిల్లా రైతుబంధు సభ్యుడు బసంత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సిందోల్‌లో కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ అభ్యర్థి క్రాంతి కిరణ్‌ను గెలిపించాలని అవ్వకు ఆప్యాయంగా ఓటు అడుగుతున్న పద్మావతి



అందోల్ ఎమ్మెల్యే అభ్యర్థి క్రాంతికిరణ్ మద్దతుగా ప్రభుత్వ పథకాలను ఓటర్లకు వివరిస్తున్న ఆయన సతీమణి పద్మావతి



బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అందోల్ ఎమ్మెల్యే అభ్యర్థి క్రాంతికిరణ్ సతీమణి పద్మావతి